# వాస్తవం

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

శనివారం 18.04.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)



జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


# నారీ..సారీ


## వీగిన 131 రాజ్యాంగ సవరణ బిల్లు

బిల్లుకు అనుకూలంగా **298**, వ్యతిరేకంగా **230**

**న్యూఢిల్లీ:** మహిళా రిజర్వేషన్ బిల్లులో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుకు మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం కాగా, ఓటింగ్ ప్రక్రియలో 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 మంది ఓటు వేశారు. దీంతో మెజారిటీకి అవసరమైన 352 మంది సభ్యుల బలం లేకపోవడంతో బిల్లు వీగిపోయినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఆ వెంటనే డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026ను వెనక్కి తీసుకున్నట్టు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు.

### మహిళా బిల్లును ఓడించి సంబరాలా?

**మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఓడించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీల ఆలోచనా ధోరణి మహిళా ప్రయోజనాలకు కానీ, దేశ ప్రయోజనాలకు మేలు చేసేవి కాదని అన్నారు. మహిళలకు 33 శాతం కోటా ఇచ్చే బిల్లును ఓడించి సంబరాలు చేసుకోవడం, దానిపై విజయోత్సవ నినాదాలు చేయడం అత్యంత గర్హనీయమని, ఊహించడానికే ఇబ్బందికరమైన విషయమని వ్యాఖ్యానించారు.**






### నేడు కేంద్ర క్యాబినెట్ అత్యవసర భేటీ

**ఢిల్లీ, ఏప్రిల్ 17 : ఢిల్లీ వేదికగా నేడు(శనివారం) జరగనున్న కేంద్ర కేబినెట్ అత్యవసర భేటీ యావత్ దేశాన్ని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ పరిణామాలు, దేశీయ ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకోబోయే నిర్ణయాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.**

### జాతీయ విపత్తును నివారించిన రోజు : రేవంత్

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నాయకత్వంలో, ఏఐ సీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో అన్ని ప్రజాస్వామిక శక్తులు, ప్రతిపక్ష నాయకులు ఐక్యంగా నిలిచి ఒక జాతీయ విపత్తును నివారించారని అన్నారు.

మోడీ సర్కార్‌కు

## భంగపాటు

### డీలిమిటేషన్ లేనట్లే?

**హైదరాబాద్, ఏప్రిల్ 17** : లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో.. నియోజకవర్గాల పునర్విభజన ఇక ఇప్పట్లో ఉండకపోవచ్చు. ప్రస్తుతం ఉన్న సీట్ల ప్రకారమే వచ్చే సాధారణ ఎన్నికలు జరుగుతాయని, జమిలి ఎన్నికలు కూడా అనుమానమేనని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెడుతూ ప్రవేశ పెట్టడంతో విపక్షాలు ఏకతాటిపైకి వచ్చి వ్యతిరేకంగా ఓటు వేశాయి. దీంతో లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజార్టీ లేని ఎన్డీయే.. ఏకపక్షంగా పునర్విభజన బిల్లు పెట్టి ఆమోదించుకోవడం సాధ్యం కాదని తేలిపోయింది. దీంతో వచ్చే సాధారణ ఎన్నికల నాటికి డీలిమిటేషన్ లేనట్టేనని స్పష్టమవుతోంది. రాజ్యాంగంలో చేసిన సవరణ, ఇప్పటికే ఆమోదం పొంది ఉన్న మహిళా రిజర్వేషన్ చట్టాల ప్రకారం.. నియోజకవర్గ పునర్విభజన ప్రక్రియ 2026 జనాభా లెక్కల ఆధారంగా చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుత మోదీ ప్రభుత్వ పదవీకాలం 2029లో ముగియనుంది. అంటే జనగణన ప్రక్రియ మొత్తం పూర్తి చేసి, పునర్విభజన ప్రక్రియ కోసం కమిషన్ వేసి, ఆ కమిషన్ తన ప్రక్రియను పూర్తి చేయడానికి ఉన్న సమయం మూడేళ్లు మాత్రమే. జనగణన ప్రక్రియ పూర్తి చేసి గణాంకాలు ప్రకటించడానికే కనీసం రెండేళ్లు పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత పునర్విభజనకు కమిషన్ వేయడం, ఆ కమిషన్ ప్రక్రియను పూర్తి చేయడం.. ఏడాది లోపు సాధ్యం కాదని పేర్కొంటున్నాయి.జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలతోపాటు చిన్న రాష్ట్రాలూ నష్టపోతాయని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా విపక్షాలు గట్టిగా వాదన వినిపిస్తున్నాయి. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఈ విషయంలో ఏకాభిప్రాయం లేనందునే వీగిపోయింది. ఈ నేపథ్యంలో వచ్చే సార్వత్రికల నాటికి డీలిమిటేషన్ ఉండదనే విషయం తేటతెల్లం అవుతోంది. ప్రస్తుత లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల ప్రకారమే ఎన్నికలు జరగవచ్చని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

# కాళేశ్వరం పునరుద్ధరణకు కమిటీ

**బరాజ్ పనుల సమన్వయానికి 9 మందితో ఏర్పాటు**

**ప్రత్యేక సలహాదారు పరీక్షిత్ మెహ్రా కమిటీకి నేతృత్వం**

**హైదరాబాద్, ఏప్రిల్17** : కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణ పనుల కోసం ఇంజినీర్లు, వివిధ ఏజెన్సీల మధ్య కో ఆర్డినేషన్ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. సొరంగ పనుల భద్రత ప్రభుత్వ సలహాదారు కల్నల్ పరీక్షిత్ మెహ్రా చైర్మన్‌గా, రామగుండం చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రావు గుప్తా మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. జాయింట్ సెక్రటరీ(టెక్నికల్) కే శ్రీనివాస్, సీడీవో సీఈ ఎంఎస్ఎన్ రెడ్డి, సీడబ్ల్యూపీఆర్ఎస్ అడిషనల్ డైరెక్టర్ సెల్వబాలన్, ఆఫ్రీ ఇండియా లిమిటెడ్ ఎండీ సాయికృష్ణ, ఎల్అండ్‌టీ జీఎం సురేశ్‌కుమార్, ఆఫ్కాన్స్ వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, నవయుగ ప్రాజెక్టు మేనేజర్ మాధవ్‌ను మెంబర్లుగా నియమించింది. మొత్తంగా 9 మందితో కమిటీని ఏర్పాటు చేసింది. అదేవిధంగా కమిటీకి పలు మార్గదర్శకాలను జారీ చేసింది. ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ మే 30వ తేదీలోగా సాంకేతిక పరీక్షలు నిర్వహించేం దుకు రోజువారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని, అదేవిధంగా రోజువారీగా ప్రగతి నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. ప్రధానంగా నిర్మాణ, సాంకేతిక పరీక్షల నిర్వహణ ఏజెన్సీలతో సమన్వయం చేస్తూ ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ నుంచి



కావాల్సిన అనుమతులను తీసుకోనే బాధ్యత కో ఆర్డినేషన్ కమిటీదేనని వెల్లడించారు. ప్రతి సోమవారం, గురువారం పరీక్షల పూర్తి నివేదికలను సమర్పించాల్సి ఉంటుందని కమిటీని సర్కార్ ఆదేశించింది.

## హరివంశ్ హ్యాట్రిక్

**రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్‌గా మూడోసారి ఎన్నిక**

**న్యూఢిల్లీ:** హరివంశ్ హ్యాట్రిక్ కొట్టారు. మూడోసారి ఆయన రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. సభాపక్ష నేత జేపీ నడ్డా తీర్మానం పాస్ చేయగా .. హరివంశ్ ఎన్నిక ప్రక్రియ లాంఛనంగా పూర్తి అయ్యింది. మోజువాణీ ఓటు ద్వారా డిప్యూటీ చైర్మెన్ నియామకం జరిగింది. హరివంశ్‌ను ఎన్నుకునేందుకు అయిదు తీర్మానాలను పాస్ చేశారు. ఏప్రిల్ 9వ తేదీన రాజ్యసభ సభ్యుడిగా హరివంశ్ రెండో టర్మ్ ముగిసింది.దీంతో డిప్యూటీ చైర్మెన్ పోస్టు ఖాళీ ఏర్పడింది. రాజ్యసభ్య వ్యవహారాల ప్రకారం రూల్ 7 కింద చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ .. డిప్యూటీ చైర్మెన్ కోసం ఎన్నిక నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. రాజ్యసభకు హరివంశ్‌ను నామినేట్ చేశారు. మూ



డోసారి డిప్యూటీ చైర్మెన్‌గా గెలిచిన హరివంశ్‌కు ప్రధాని మోదీ, విపక్షనేత ఖర్గు కంగ్రాట్స్ తెలిపారు. రాజ్యసభ చరిత్రలో ఓ నామినేటెడ్ సభ్యుడు డిప్యూటీ చైర్మెన్‌గా ఎన్నిక కావడం ఇదే తొలిసారి. గతంలో హరివంశ్ జర్నలిస్టుగా చేశారు. విపక్షాలకు తగిన సమయాన్ని డిప్యూటీ చైర్మెన్ కేటాయిస్తారని భావిస్తున్నట్లు ఖర్గే చెప్పారు. హరివంశ్ ఎన్నికపై తీర్మానం పాస్ చేసిన సమయంలో సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ వాకౌట్ చేశారు.

మెజీషియన్ ఆఫ్

## బాలాకోట్.. డిమానిటైజేషన్.. సింధూర్

**మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు**

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీని ఓ ఇంద్రజాలకుడితో పోల్చారు రాహుల్ గాంధీ. శుక్రవారం లోక్‌సభలో ఆయన రాజ్యాంగ సవరణ బిల్లులపై మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బాలాకోట్ దాడులు.. డీమానిటైజేషన్.. ఆపరేషన్ సింధూర్ ఇంద్రజాలకుడు మోదీ అని రాహుల్ విమర్శలు చేశారు. దీంతో బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డిమాండ్ చేశారు. మోదీపై చేసిన వ్యాఖ్యలు ఖండించదగ్గవని ఆయన అన్నారు.రాహుల్ తన ప్రసంగంలో పదేపదే మెజీషియన్ అన్న పదాన్ని వాడారు. ప్రధాని మోదీని ఉద్దేశించేందుకు ఆయన ఆ పదాన్ని వాడారు. అయతే స్పీకర్ ఓం బిర్లా ఆయనకు వార్నింగ్ ఇచ్చారు. ఇలాగే మాట్లాడితే



అవకాశం ఇవ్వనున్నారు. దీంతో ఆ పదాన్ని వాడబోనని రాహుల్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో మహిళా సాధికారత సంబంధం లేని అంశమని రాహుల్ అన్నారు. ఇది కేవలం దేశ ఎన్నికల మ్యాప్‌ను మార్చే అంశమన్నారు. కుల గణనను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దళితులు, ఓబీసీలకు ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై

## ఎలాంటి దురుద్దేశం లేదు

**మంత్రి ఉత్తమ్**

**ఢిల్లీ, ఏప్రిల్ 17 :** కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు.శుక్రవారం ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు.గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై



కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు.కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

# గిల్.. జిగేల్

**గుజరాత్‌ను గెలిపించిన కెప్టెన్**

**కోల్‌కతాకు ఐదో ఓటమి**

**గ్రీన్ పోరాటం వృథా**

**రెండు ఓటములతో ఈ ఐపీఎల్‌ను ఆరంభించిన గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం నిలకడగా దూసుకెళ్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (50 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 86) కళాత్మక బ్యాటింగ్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 5 వికెట్ల తేడాతో నెగ్గిం ది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందు గా కోల్ కతా 20 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. కామెరూన్ గ్రీన్ (55 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 79), పోవెల్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27) మాత్రమే రాణించారు. ఛేదనలో గుజరాత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 181 పరుగులు చేసింది. బట్లర్ (25), సుదర్శన్ (22) రాణించారు.ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.ఓ మాదిరి ఛేదనను గుజరాత్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. అయినా కేకేఆర్ బౌలర్లు మధ్య ఓవర్లలో కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. మ్యాచ్‌ను కాపాడుకునేందుకు చివరి ఓవర్ వరకు పోరాడినా టైటాన్స్‌దే పైచేయి అయ్యింది.**



# గోల్డెన్ అవర్‌లో స్పందన కీలకం

## జైపూర్ ఎస్సై రాజశేఖర్



**వాస్తవం : జైపూర్**

ప్రాణాపాయ పరిస్థితుల్లో ప్రమాదం జరిగిన వెంటనే తొలి గంట అయిన 'గోల్డెన్ అవర్‌'లో తక్షణ స్పందన ఉంటే అనేక ప్రాణాలను కాపాడవచ్చని జైపూర్ ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు. గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత, సీపీఆర్ విధానం, రహ్-వీర్ పథకం గురించి అవగాహన కల్పించేందుకు జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తర్వాత తొలి 60 నిమిషాలు అత్యంత కీలకమని, ఈ సమయంలో గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందితే ప్రాణాపాయం తగ్గుతుందని తెలిపారు. రక్తస్రావాన్ని నియంత్రించడం, శ్వాస సక్రమంగా ఉండేలా చూడడం వంటి ప్రాథమిక చర్యలు ప్రాణరక్షణలో కీలకమని వివరించారు. ప్రమాద బాధితులకు తక్షణ సహాయం చేసి ప్రాణాలను కాపాడిన వ్యక్తులను ప్రభుత్వం "రాహ్-వీర్"లుగా గుర్తించి రూ.25, 000 నగదు బహుమతితో సత్కరిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజల్లో సేవాభావం పెంపొం దుతుందని, అత్యవసర సమయంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీపీఆర్ విధానంపై అవగాహన కల్పి స్తూ, గుండె లేదా శ్వాస ఆగినప్పుడు వెంటనే స్పందించి, ముందుగా బాధి తుని స్పందన, శ్వాసను పరిశీలిం చాలని సూచించారు. ఛాతిపై సరైన స్థానంలో నిమిషానికి 100--120 కంప్రెషన్స్ వేగంతో ఒత్తిడులు ఇవ్వాలని తెలిపారు. శిక్షణ పొంది నవారే మౌత్-టు-మౌత్ విధానం చేయాలని సూచించారు. వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం అందించాలని, గాయపడిన వ్యక్తిని అవసరం లేకుండా కదలించవద్దని హెచ్చరించారు. రక్తస్రావం ఉంటే గట్టిగా కట్టు కట్టి నియంత్రించాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటిం చడం ద్వారా ప్రమాదాలను నివారిం చవచ్చని ఎస్సై రాజశేఖర్ సూచిం చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

### శివ్వారం గ్రామపంచాయతీపై

# ఎంపీవో ఆకస్మిక తనిఖీ



**వాస్తవం : జైపూర్**

జైపూర్ మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు శివ్వారం గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, జిల్లా పంచాయతీ అధికారి మార్గదర్శకత్వంలో నిర్వ హించిన ఈ తనిఖీలో 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన వ్యయాలు, బిల్లులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సంద ర్భంగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు క్రమబద్ధంగా నిర్వహించాలని, ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ఏర్పాటు చేసిన విషయాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపల్లి అంజన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కంటిలో సింగరేణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**జైపూర్:వాస్తవం**



సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టిపిపి) ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని ఎల్కంటి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామ ప్రజలు విశేషంగా హాజరై వైద్య పరీక్షలు చేయించు కున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్టిపిపి ఈడీ సి. హెచ్. చిరంజీవి మాట్లాడుతూ ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్య పరిరక్షణ సింగరేణి యాజమాన్యానికి అత్యంత ప్రాధాన్యతగా ఉందన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇటువంటి వైద్య శిబిరాలను తరచుగా నిర్వహిస్తూ గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకముందే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకొని తమ ఆరోగ్య స్థితిగతులను పరీక్షించించుకోవాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. డాక్టర్ కె. పవన్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, రక్తపోటు, షుగర్ వంటి వ్యాధుల పరిశీలన నిర్వహించామని తెలిపారు. సుమారు 40 మంది వరకు గ్రామస్తులు శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారని, వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. అవసరమైన వారికి తదుపరి చికిత్స కోసం సూచనలు కూడా అందించినట్లు వెల్లడించారు.

## ఉద్యోగ సమస్యల పరిష్కారానికి డిమాండ్



**వాస్తవం : జైపూర్**

తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక మరియు పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర, జిల్లా శాఖల ఆదేశాల మేరకు జైపూర్‌లో తహసీల్దార్ వనజ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జైపూర్ మండల అధ్యక్షుడు పత్తిపాక రాజన్న, ప్రధాన కార్యదర్శి జి. వెంకటస్వామి పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించిన రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజిపి రమేష్ నాయుడు



**వాస్తవం : వేములవాడ**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర రైల్వే , రోడ్డు భద్రత ఐజిపి రమేష్ నాయుడు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయానికి చేరుకున్న ఐజిపికి ఆలయ అర్చకులు,వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సిఐ వీరప్రసాద్,ఆర్ఐ సురేష్, ప్రోటోకాల్ ఏఈఓ జి అశోక్ కుమార్,ఆలయ పర్యవేక్షకులు ఎన్ రాజేందర్ పాల్గొన్నారు.

# రామగిరి మండలంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

**ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి**
**గుర్రం శ్రీనివాస్ గౌడ్**

**వాస్తవం : రామగిరి,ఏప్రిల్ 17:**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా రామగిరి మండలంలోని ఆదివారంపేట, రాజాపూర్ గ్రామంలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ఆదివారంపేట,రాజాపూర్ గ్రామంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతల గురించి,చదువు మానేసిన,ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు,ఉద్యోగం,స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో,ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే



వారి ఆదాయ వివరాలను కూడా నమోదు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఇల్లందుల సంజీవ్,పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య, పంచాయతీ సెక్రటరీలు మెండే వేణు గోపాల్,దాసరపు కిరణ్,ఆశా వర్కర్లు, కాదాసి స్వప్న,సంధ్య,అంగన్వాడి టీచర్లు ఇల్లందుల లలిత,కారోబార్ పరశురాములు,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాస్తవం



# ఎండాకాలం జాగ్రత్తలు తెలియజేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం : సిరిసిల్ల**

ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చేవారికి జాగ్రత్తలు తెలియజేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొ



న్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో వైద్య రాలు రేణుక, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# నస్తురుపల్లిలో సభ ఏర్పాట్లు పరిశీలించిన డీఎల్పీఓ



**వాస్తవం : కాటారం**

కాటారం మండలం నస్తురుపల్లి గ్రామంలో జరగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లను అధికారులు సమీక్షించారు. ముఖ్యంగా సభకు వచ్చే వాహనాల కోసం ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదే శంలో లైటింగ్ సదుపాయాలపై ప్రత్యేకంగా పరిశీలన నిర్వ హించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత కాం ట్రాక్టర్‌కు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచ నలు జారీ చేశారు. సభకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేయాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ మల్లికార్జున్ రెడ్డి, ఎంపీఓ వీర స్వామి, విద్యుత్ శాఖ అధికారులు, పంచాయతీ కార్య దర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ సూచికల బోర్డులు ఏర్పాటు

**వాస్తవం : మాడుగులపల్లి :**

మండలంలోని కల్వలపాలెం గ్రామంలో గ్రామ సూచికల బోర్డులు లేకపోవడంతో నూతనంగా గెలిచిన సర్పంచ్ చిట్యాల సునీత దానియేలు గ్రామానికి నాలుగు వైపులా నాలుగు బోర్డులను సల్కునూరు, ఎరుకల గుట్ట, పాముల పహాడ్, భీమనపల్లి బొమ్మకల్, గ్రామాల నుంచి వచ్చే వారికి కల్వల పాలెం గ్రామం సూచిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రా మంలో కనీసం గతంలో గ్రామ సూచి కల బోర్డులు లేకపోవడంతో కొత్తవాళ్లు ఊరికి రావాలంటే నానా అవస్థలు పడ వలసి వచ్చింది ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుం




డా బోర్డులను ఏర్పా టు చేయడం జరిగింది అదేవిధంగా గ్రామంలో అభివృద్ధి కోసం మౌలిక సౌకర్యాలను కల్పిస్తూ గ్రామ అభివృద్ధికి లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ప్రస్తు తం గ్రామంలో వీధిలైట్ల తో పాటు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి వీధిలో కాలువల్లో పేరుకుపోయిన పూడికను పూర్తిగా తీసివేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేసాని ప్రభాకర్ రావు,గ్రామ శాఖ అధ్యక్షుడు చింతకాయల సతీష్, గ్రామస్తులు అబ్రహం, సూర్యకుమార్, క్రాంతి, లక్కీ, లింగయ్య, దాసు, పాపమ్మ,లు పాల్గొన్నారు.

## చింతకానిలో చిన్న కాళేశ్వరం

# భూసేకరణపై గ్రామసభ




**వాస్తవం : కాటారం**

కాటారం మండలం చింతకాని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద పోలారం సిస్టర్న్ ప్రధాన కాలువ, డిస్ట్రి బ్యూటరీలు, మైనర్ కాలువల తవ్వకానికి సంబంధించిన భూసేకరణపై గ్రామసభ నిర్వహించారు. భూమి స్వాధీనము, న్యాయపరమైన పరిహారం మరియు పారదర్శకత హక్కుల చట్టం--2013లోని సెక్షన్ 11(2) ప్రకారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 17 ఎకరాలు 10 గుంటల భూమి సేకరణపై రైతులకు వివరాలు తెలియజేసి, పరిహారం అం శాలపై చర్చించారు. కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ మా ర్క రామ్మోహన్, స్పెషల్ నాయబ్ తహశీల్దార్ కృష్ణ, సాగునీటి శాఖ అధికారులు, సర్వేయర్లు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

**డిమాండ్లను వెంటనే అమలు చేయాలి**

**దుమ్ముగూడెం : వాస్తవం**

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల అసలు పరిష్కరించాలని పి ఆర్ టి యు టి ఎస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని లక్ష్మీనగరం తహసీల్దార్ కార్యాలయంలో డిటి తహసిల్దార్ భరణి బాబుకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సీపీయస్ రద్దు చేసి, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు తక్షణమే పాత పెన్షన్ విధానం అమలు



చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం టీజేఏ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన మొదటి నిరసన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి, లంచ్ అవర్స్‌లో నిరసనలు తెలియజేశారు. కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ నుండి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కారం పూడి దశమ్ బాబు, డి .శ్రీనివాసరావు, మల్లికార్జున రావు, యుటిఎఫ్ టీఎస్ నుండి ఏ .వెంకటేశ్వర్లు బి. మంగవేణి టి పి టి ఎఫ్ నుండి బి. రాజు రెవిన్యూ సిబ్బంది నుండి కె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం ఉప సర్పంచ్

# శ్రీనివాస్ గౌడ్‌కు సత్కారం



**వాస్తవం:కాటారం**

కాటారం మండలం బయ్యారం గ్రామపంచాయతీలో ఇటీవల ఉప సర్పంచ్‌గా ఎన్నికైన జాగిరి శ్రీనివాస్ గౌడ్‌ను భూపాలపల్లి జిల్లా గౌడ సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు హాజరై ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, యువత పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షిత గమ్యం చేరుకోవాలి

**మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్**

**వాస్తవం : అందోల్**

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకునేటట్టు చూసుకోవాలని ఆందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చిట్టిబాబులు ఉద్బోధించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జోగిపేట ఏరియా ఆసుపత్రిలో పోలీసు, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. పోలీసు వారు సూచించినట్టుగా తలకు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. అంతకుముందు వైద్యశాఖ అధికారులు గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిపిఆర్ చేసి చూపించారు. భయపడకుండా ప్రతి మనిషికి సిపిఆర్ ఎలా చేయాలో 108 వచ్చేలోపు ఏం చేయాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు . సి పిఆర్ గురించి వైద్యాధికారులు విద్యార్థులకు చేసి చూపించారు. అనంతరం జోగిపేట ఏరియా ఆస్పత్రి సూపరిడెంట్ డాక్టర్స్ సౌజన్య మాట్లాడుతూ ఆసుపత్రిలో సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటు చికిత్సలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ




కార్యక్రమంలో జోగిపేట సిఐ అనిల్ కుమార్, కౌన్సిలర్లు అరుణ్, పట్లోళ్ల శ్రీనివాస్, నాని, దుర్గేష్, అనిల్ కుమార్, ప్రదీప్ గౌడ్, డాక్టర్ శివ శంకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్, రామకృష్ణ, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాదిగలకు 10 నుండి 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

**ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు**

**వాస్తవం : సిద్దిపేట ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న ఏకైక కులం మాదిగలు మాత్రమే అని గత 12 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ చేస్తున్న ప్రకటన సత్యమని కుల గణన రిపోర్ట్ రుజువు చేసిందని, మా జనాభా 10% నుండి 11% ఉందని, ఎస్సీ వర్గీకరణలో కూడా మాకు అంతే వాటా కేటాయించాలని మంద కృష్ణ మాదిగ గతంలో లేవనెత్తిన ప్రశ్నలు సంపూర్ణ న్యాయమని కుల గణన రిపోర్ట్ తో స్పష్టం అయిందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనువాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు మాదిగ అన్నారు. సిద్దిపేట ప్రెస్క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగం పల్లి శ్రీనివాస్ మాదిగ, ముక్కపల్లి రాజు మాదిగ , ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గారితో కలిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన నివేదికలో మాదిగల జనాభా 10.3 % గా తేలిందని దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణలో 10 నుండి 11% రిజర్వేషన్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చే సమయంలోనే 9% రిజర్వేషన్ వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని మంద కృష్ణ మాదిగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. అయినా రేవంత్ రెడ్డి ఆనాడు న్యాయం చేయలేకపోయారు. ఇప్పుడు వచ్చిన కుల గణన రిపోర్ట్ ద్వారా మాదిగల జనాభా శాతం గణంకాలతో సహ ఋజువైందని, ఇప్పుడైనా రేవంత్ రెడ్డి వైఖరిలో మార్పు తెచ్చుకొని న్యాయం చేస్తా రని ఆశిస్తున్నాం అని అన్నారు. మంద కృష్ణ మాదిగ జనాభా ప్రకారం మాదిగలకు 11% శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే ముఖ్యమంత్రి మెప్పు కోసం కొంత జాతి ద్రోహులు మాదిగ మేధావుల ముసుగులో 9% రిజర్వేషన్లను స్వాగతించి తీరని అన్యాయం చేశారని అన్నా రు.అలాంటి ద్రోహులకు కుల గణన రిపోర్ట్ చెంప పెట్టు లాంటిదని అన్నారు. మాదిగల జనాభా శాతానికి కన్న తక్కువ శాతం రిజర్వేషన్లు రావడాన్ని స్వాగతించిన ద్రోహులు ఇప్పుడు మాదిగ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.కీలక ఘట్టంలో జాతికి వెన్నుపోటు పొడిచి తీరని ద్రోహం చేసిన వాళ్లకు జాతి గురించే మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాదిగలలో ఉన్న పేదరికాన్ని తొలగించడానికి తగిన సంక్షేమ పథకాల్ని ప్రవేశ పెట్టాలని, ప్రభుత్వ భూములను మాదిగలకు పంచాలని డిమాండ్ చేశారు.అన్ని రకాల ప్రభుత్వరంగ నియామకాల్లో 11% వాటా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెర్క పర్శరాములు మాజీ జిల్లా ప్రెసిడెంట్ దండు శంకర్ వి హెచ్ పి ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ,సామ్రాట్ ప్రకాష్ ఎమ్మెస్ ఎఫ్ జిల్లా ప్రెసిడెంట్, చుంచు రమేష్ మాజీ జిల్లా అధికార ప్రతినిధి, జేరిపోతుల లక్ష్మణ్ మాదిగ, మాజీ జిల్లా వైస్ ప్రెసిడెంట్,బింగి పవన్ కళ్యాణ్ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి,బింగి నవీన్ ఉప సర్పంచ్, ఎల్లయ్య బీజేఆర్ ప్రెసిడెం ట్ , దండు కనుకయ్య,గుండుకాడి బాబు, చింతమడక పర్శరాములు,పొన్నాల కనుకయ్య,బింగి బాలకిషన్,బొత్త దుర్గయ్య,దాకాని కనకరాజు,తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

**రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు పేర్కొన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 18 వరకు వారోత్సవాల సందర్భంగా అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో శుక్రవారం జిల్లాలోని ఆర్టీసీ, విద్యాసంస్థలు, ఆటో, మున్సిపల్, ఇతర వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు , జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.ఈసందర్భంగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు ముందుగా స్పందించి ప్రాణాలు కాపాడేది వాహనాల డ్రైవర్లేనని తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనల మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,అలాగే విద్యార్థుల రవాణాలో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ...ఎక్కువ ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తోనే అవుతున్నాయని తెలిపారు. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అలాగే జిల్లాలో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం వాహనాల డ్రైవర్లతో కలిసి రహదారి భద్రత పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్ రజిత, తహసీల్దార్ మహేష్ కుమార్, సిఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వీరప్రసాద్,వెంకటేశ్వర్లు, శ్రీనివాస్,మధుకర్, ఆర్ఐలు మధుకర్, రమేష్,యాదగిరి, సురేష్, ఎస్ఐ లు, పోలీస్, రవాణా శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.








# ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవాలి

**పీఆర్టీయు జిల్లా అధ్యక్షులు మానయ్య**



**వాస్తవం : అందోల్**

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకో వడంలేదని సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమం చేపడ తామని పీఆర్టీయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల మానయ్య అన్నారు. టీజీఈ జెఏసి పిలుపు మేరకు జోగిపేట ఉపాధ్యాయులు భోజన విరామ సమ యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఆకుల మాన య్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించే వరకు ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు, ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మం జూరు చేయాలన్నారు. పెన్షనర్ల పెం డింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు, సి పిఎస్ రద్దు గావిస్తూ పాత పెన్షన్ వర్తింప చేయాలన్నారు ఈ నాలుగు సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పం దించి పరిష్కరించాలన్నారు. అనంతరం ఆందోలు తహసిల్దార్ మధుకర్ రెడ్డికి విజ్ఞాపన పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆకుల మానయ అందోల్ పీఆర్టీయు అధ్యక్షులు నరోత్తం కుమార్, ప్రధాన కార్యదర్శి మాయ చారి, జిల్లా బాధ్యులు జంగింటి అనిల్ కుమార్, మంజా నాయక్, త్రినా థరావు, రమేష్ కుమార్ ,చంద్రశేఖర్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రేమించి గర్భవతిని చేసి.. ఇప్పుడు నాకు ఎలాంటి సంబంధం లేదంటున్న కానిస్టేబుల్



**వాస్తవం , జైపూర్, ఏప్రిల్ 17**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన సోతుకు సాయిరాజ్ వయసు 27 సంవత్సరాలు ఎస్ సి మాల ( కానిస్టేబుల్) అదే గ్రామానికి చెందిన కురిసింగా నీలిమ వయసు 33 తండ్రి పోచయ్య ఎస్ టీ కోయను ప్రేమించి గర్భవతిని చేసి రెండు రోజుల క్రితం బాబు జన్మిం చాడు.ఇప్పుడు ఆ బాబుకు నాకు ఎలాంటి సంబంధం లేదు అని మోసం చేశాడని ఆరోపిస్తూ, బాధితురాలు తన బాబు తో కలిసి సోతుకు సాయిరాజ్ ఇంటి ముందు నిరసన చేపట్టింది. అయితే,సాయి రాజ్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. బాధితురాలు నీలిమ తనకు తనకు పుట్టిన బాబుకు న్యాయం చేయాలని వేడుకుంది.

# గోల్డెన్ అవర్‌లో మీ సహాయం...ఒక ప్రాణానికి అండ

**- గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి**



**వాస్తవం, గోదావరిఖని, ఏప్రిల్ 17:**

రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం ప్రజల ప్రాణరక్షణలో అత్యంత కీలకమైన "గోల్డెన్ అవర్" ప్రాము ఖ్యతను దృష్టిలో ఉంచుకొని గోదావరి ఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసే నారెడ్డి ఆధ్వర్యంలో గోల్డెన్ అవర్ స్పందన, ప్రమాదాలు, అత్యవసర పరిస్థి తుల్లో మొదటి గంటలో తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అవగాహన కల్పిం చారు. ముఖ్యంగా ఫస్ట్ ఎయిడ్, గాయ పడిన వారికి తక్షణ సహాయం, సురక్షిత రవాణా విధానాలపై వివరించారు. సీఐ మాట్లాడుతూ... ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే "గోల్డెన్ అవర్"లో సరైన చర్యలు తీసుకుంటే అనేక ప్రాణా లను కాపాడవచ్చని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మా త్రమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాద స్థలంలో వేగవంతంగా స్పం దించడం, గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించడం, అంబులెన్స్ సేవ లను సమన్వయం చేయడం వంటి అం శాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్లు, వీ లవ్ ఫౌం డేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# గిల్.. జిగేల్

**గుజరాత్‌ను గెలిపించిన కెప్టెన్**

**కోల్‌కతాకు ఐదో ఓటమి**

**గ్రీన్ పోరాటం వృథా**



**అహ్మదాబాద్:** రెండు ఓటములతో ఈ ఐపీఎల్‌ను ఆరంభించిన గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం నిలకడగా దూసుకెళ్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (50 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 86) కళాత్మక బ్యాటింగ్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 5 వికెట్ల తేడాతో నెగ్గిం ది. జీటీకిది హ్యాట్రిక్ విజయం కాగా.. అటు కేకేఆర్ ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒకటి వర్షంతో రద్దుకాగా, మిగిలిన ఐదింటిలోనూ ఓడింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందు గా కోల్‌కతా 20 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. కామెరూన్ గ్రీన్ (55 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 79), పోవెల్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27) మాత్రమే రాణించారు. రబాడకు మూడు.. సిరాజ్, అశోక్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 181 పరుగులు చేసింది. బట్లర్ (25), సుదర్శన్ (22) రాణించారు. వరుణ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.శుభ్‌మన్ పోరాటం: ఓ మాదిరి ఛేదనను గుజరాత్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. అయినా కేకేఆర్ బౌలర్లు మధ్య ఓవర్లలో కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. మ్యాచ్‌ను కాపాడుకునేందుకు చివరి ఓవర్ వరకు పోరాడినా టైటాన్స్‌దే పైచేయి అయ్యింది. ఓపెనర్లు గిల్, సుదర్శన్ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగడంతో తొలి మూడు ఓవర్లలోనే స్కోరు 40కి చేరింది. ఆరో ఓవర్‌లో సుదర్శన్ వెనుదిరగడంతో తొలి వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అదే ఓవర్‌లో బట్లర్ 4,6,4తో పవర్‌ప్లేలో టైటాన్స్ 71/1 స్కోరుతో పటిష్ఠంగా నిలిచింది. కానీ మధ్య ఓవర్లలో కేకేఆర్ బౌలర్లు గుజరాత్‌ను కట్టుదిట్టం చేశారు. 27 బంతుల్లో గిల్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. అటు బట్లర్‌ను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేశాడు. సుందర్ (13) కూడా విఫలమయ్యాడు. అయితే 17వ ఓవర్‌లో గ్రీన్ డైవింగ్ క్యాచ్‌తో గిల్ పోరాటం ముగిసింది. అప్పటికి సమీకరణం 18 బంతుల్లో 23 పరుగులకు చేరింది. చివరి ఓవర్లో ఆరు పరుగులు చేయాల్సి వచ్చింది. ఫిలిప్స్ (19)ను పేసర్ రమణ్‌దీప్ అవుట్ చేసినా మరో 2 బంతులుండగానే టైటాన్స్ మ్యాచ్‌ను ముగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఎట్టకేలకు గ్రీన్ బ్యాట్ ఝుళిపించినా, అతడికి మరో ఎండ్‌లో సహకారం కరువైంది. దీనికి తోడు ఆఖర్లో గుజరాత్ బౌలర్లు 33 పరుగులే ఇచ్చి చివరి 6 వికెట్లు పడగొట్టారు. దీంతో కేకేఆర్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ రహానె తొలి ఓవర్‌లోనే గోల్డెన్ డకౌట్ కాగా, రెండో ఓవర్‌లోనే రఘువంశీ (8) కూడా వెనుదిరిగాడు. ఇక అలెన్ స్థానంలో బరిలోకి దిగిన మరో ఓపెనర్ సైఫర్ట్ (19) నాలుగో ఓవర్‌లో రబాడకు చిక్కాడు. తద్వారా పవర్‌ప్లేను కేకేఆర్ 32/3 స్కోరుతో పేలవంగా ముగించింది. ఈ దశలో గ్రీన్-పోవెల్ అడపాదడపా బౌండరీలతో నాలుగో వికెట్‌కు 55 రన్స్ జోడించారు. 11వ ఓవర్‌లో పోవెల్ నిష్క్రమించాక గ్రీన్ జోరు పెంచాడు. 12వ ఓవర్‌లో స్పిన్నర్ రషీద్‌ను లక్ష్యంగా చేసుకుని 4,6,4తో 16 రన్స్ సాధించగా.. పేసర్ అశోక్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాది హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అదే ఊపుతో రషీద్ తర్వాతి ఓవర్‌లోనూ 6,4,6తో గ్రీన్ దూకుడు సాగించాడు. అయితే ఇదే ఓవర్‌లో అతడు స్టంప్, క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్నాడు. కానీ 15వ ఓవర్ నుంచి టైటాన్స్ పేసర్లు పట్టు సాధించడంతో కేకేఆర్ ఆట లయ తప్పింది. వరుస ఓవర్లలో అనుకుల్ (9), రింకూ (1), రమణ్‌దీప్ (17), నరైన్ (0), కార్తీక్ త్యాగి (6) పెవిలియన్‌కు చేరడంతో గ్రీన్ క్రీజులో ఉన్నా లాభం లేకపోయింది. ఇక చివరి ఓవర్‌లో రషీద్ ఆరు పరుగులే ఇచ్చి గ్రీన్ వికెట్‌ను కూడా తీయడంతో కేకేఆర్ ఇన్నింగ్స్ ముగిసింది.

# నిజాయితీ గల దళిత అధికారిపై రాజకీయ కుట్ర

**ఎస్ఐ ప్రవీణ్ కుమార్ 'అటాచ్' పై ధర్మసమాజ్ పార్టీ ఆగ్రహం**

**వాస్తవం : ఎల్కతుర్తి**

ఎల్కతుర్తి మండలంలో తనదైన శైలిలో సేవలందిస్తూ, ప్రజల మన్ననలు పొం దిన ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ని అక స్మాత్తుగా ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటా చ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం వెనుక అగ్రకుల నాయకుల కుట్రలు ఉన్నాయ ని ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు ఆరోపించారు. ఒక దళిత అధికారి ఎదుగుదల చూడలేక, తమ అక్రమాలకు అడ్డు వస్తున్నారనే నెపంతోనే ఈ 'వేటు' వేయించారని ఆయన విమర్శించారు.

**కుట్రలు - కక్షపూరిత చర్యలు:**

ప్రవీణ్ కుమార్ బాధ్యతలు చేపట్టి నప్పటి నుండి మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు, యువత చైత న్యానికి ఎంతో కృషి చేశారు. ఎవరైనా సమస్యతో వస్తే రాజకీయాలకు అతీతంగా స్పందించి న్యాయం చేసే వారని ప్రజలు చెబుతున్నారు. అయితే, కొంతమంది స్థానిక అగ్రకుల నాయ కులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం, ఆయన సహకరించడం లేదని అక్రమ ఆరోపణలు సృష్టించి పైస్థాయి అధికా రులను తప్పుదోవ పట్టించారని బొంకూరి రాజు పేర్కొన్నారు.

**ప్రజా వ్యతిరేక నిర్ణయం:**

సామాన్యులకు అందుబాటులో ఉండే అధికారిపై ఇలాంటి చర్యలు తీసుకోవ డం వల్ల ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై ఉన్న నమ్మకం సడలుతుందని ఆయన ఆవేద న వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే స్టేషన్‌లో దళిత అధికారులపై ఇటు వంటి కుట్రలు జరిగిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**ధర్మసమాజ్ పార్టీ డిమాండ్లు:**

నిష్పక్షపాత విచారణ: ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. కుట్ర పూరితంగా జరిగిన ఈ అటాచ్‌మెంట్ ఉత్తర్వులను వెనక్కి తీసుకుని, ఆయనను తిరిగి ఎల్కతుర్తి



ఎస్ఐగా నియమించాలి.పోలీస్ వ్యవ స్థలో రాజకీయ నాయకుల, ముఖ్యంగా అగ్రకుల పెత్తనాన్ని అరికట్టి అధికా రులకు స్వేచ్ఛగా పనిచేసే అవకాశం కల్పించాలి. అన్యాయంగా ఇలా జర గడం వల్ల ప్రవీణ్ కుమార్‌కి న్యాయం జరిగే వరకు ధర్మసమాజ్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే ఆందోళనలు ఉధృతం చేస్తామని బొంకూరి రాజు హెచ్చరించారు.

# దళితరత్న అవార్డు అందుకున్న బందెల నరేష్

సమాజ సేవకు గుర్తింపుగా పురస్కారం

వాస్తవం : తిరుమలగిరి



తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన బందెల నరేష్ చందు సామాజిక సేవకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. కమిటీ చైర్మన్ అనీల్ కుమార్ చేతుల మీదుగా హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో దళిత రత్న పురస్కారం అందించారు. గత 20 సంవత్సరాలుగా సమాజ సేవలో నిమగ్నమై షెడ్యూల్ కులాలు అభివృద్ధి సమితి కార్మిక విభాగంలో కార్మిక అవసరాలు, హక్కుల కోసం, వారి పిల్లల చదువుల కోసం కృషి చేస్తున్నాడు. లేబర్ కార్డు ఇప్పించడంలోనూ దేశం కోసం పోరాటం చేసిన మహనీయుల జయంతి వర్ధంతుల విషయంలోనూ ముందుండి నిర్వహించడం లాంటి సామాజిక కార్యక్రమాలలో చేసిన కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం బందెల నరేష్ కు దళిత రత్న పురస్కారం అందించింది. ఈసందర్భంగా బందెల నరేష్ చందు మాట్లాడుతూ సమాజ సేవలో నిరంతరం కొనసాగుతానని, ఈ అవార్డు ఇచ్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# గిరిజనులమధ్య చిచ్చు పెడుతున్న జిల్లా సహకార అధికారి

కలెక్టర్ సారూ డిసిఓ పై చర్యలు తీసుకోండి

మాకు ఉపాధి కల్పించే మా ఇసుక ర్యాంపు మాకు కావాలి

శ్రీరామ మహిళా ఇసుక సొసైటీ కమిటీ సభ్యులు.

చర్ల : వాస్తవం



మండలంలోని గిరిజనులకు వర ప్రధాయినిగా మారిన డీసెల్టింగ్ ఇసుక ర్యాంపులకు సంబంధించి గిరిజన గ్రామాలలో గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్న జిల్లా సహకార అధికారిపై చర్యలు తీసుకోవాలని శ్రీరామ మహిళా ఇసుక సొసైటీ కమిటీ సభ్యులు కలెక్టర్ ను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని కలివేరు గ్రామంలో శ్రీరామ మహిళా ఇసుక సొసైటీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించి, తమ ఆవేదనను వెళ్లగక్కారు. రాష్ట్ర ప్రభుత్వం మండల పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతంలో గల గోదావరి నదిలో ఇసుక పూడికతీత పనుల కోసం గిరిజన మహిళా సొసైటీలను ఏర్పాటుచేసి పూడికతీత పనులను నిర్వహిస్తున్న సంగతి విధితమే. దానిలో భాగంగా జిల్లా సహకార అధికారి ఆదేశాలకు కలివేరు గ్రామంలో గల 300 మంది గిరిజన మహిళలు సొసైటీగా ఏర్పడి సభ్యత్వాలకు సంబంధించి డబ్బులు చెల్లించిన అనంతరం ఆ అధికారి అదే గ్రామంలో మరొక కమిటీని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో గ్రామంలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. దీనితో శ్రీరామ ఇసుక మహిళ సొసైటీ కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జిల్లా సహకార అధికారి తమ గ్రామంలో ఇసుక మహిళా సొసైటీని ఏర్పాటు చేసుకోమని తెలపడంతో సొసైటీని ఏర్పాటు చేసుకున్నామని,తీరా ఇప్పుడు మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు అనుచరులు వేరొక సొసైటీని 17 మందితో ఏర్పాటుచేసి తమ జీవనోపాధికి ఆటంకం కల్పిస్తున్నారని,దీని అంతటికి జిల్లా సహకార అధికారి కారణమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ నాయకురాలు రమాదేవి శ్రీదేవి,నాగమణి, పసుపులేటి గౌతం,శ్యామల హైమావతి,సోడి రమణ,పూణెం గంగమ్మ,దుర్గం శాంతమ్మ,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల జేఏసి

# ఆధ్వర్యంలో నిరసన



వాస్తవం : చిగురుమామిడి

ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల జేఏసి పిలుపుమేరకు చిగురుమామిడి రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది చిగురుమామిడి తహశీల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన పీఆర్సీ,పెండింగ్ డీఎలు,పదోన్నతులు వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో తహశీల్దార్ ఎం రమేష్, రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Regd No. 914/2015
JSS
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH TRADE UNION

మానసాని కృష్ణారెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

ఉద్యోగుల,ఉపాధ్యాయుల సమస్యలను

# ప్రభుత్వం పరిష్కరించాలి



వాస్తవం : వేములవాడ

ఉద్యోగుల,ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పురస్కరించాలని డిమాండ్ చేస్తూ వేములవాడ మండలం బాలరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ ఉద్యోగులు,గెజిటెడ్ అధికారుల,ఉపాధ్యాయులు, కార్మికులు,పెన్షనర్ల ఆధ్వర్యంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నప్రధాన డిమాండ్ లను ప్రభుత్వం పురస్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పులి రామ్ గోపాల్ గౌడ్,రాజేశం,మధుకర్,అనిత,లతిక పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో సమస్యల పరిష్కారం

గుడిసె యాదయ్య



వాస్తవం : రాజేంద్రనగర్

ప్రజల భాగస్వామ్యంతో సమస్యల పరిష్కారంఅవుతుందని అంబేద్కర్ సంఘం నాయకులు గుడిసె యాదయ్య అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ లోని బస్తీ దవఖానను అంబేద్కర్ సంఘం నాయకులు సందర్శించారు. దవాఖానాలో నిరుపయోగంలో ఉన్న ఫ్యాన్ల ను గమనించిన గుడిసె యాదయ్య తన వంతు సహాయంగా కొత్త ఫ్యానును సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పంబాల రాజు, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు గొడుగు సంజీవ, వేణు, దళిత రత్న పత్యార నరసింహ, బచ్చల రాజు, తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులను పర్యవేక్షించిన

# అడిషనల్ కలెక్టర్

త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



వాస్తవం : హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై జరుగుతున్న సుందరీకరణ మరియు అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ శుక్రవారం పర్యవేక్షించారు. సుందరీకరణ పనుల పనితీరును, అభివృద్ధి పనుల గురించి సంబంధిత శాఖ అధికారులు అడిషనల్ కు వివరించారు. సుందరీకరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా పనిచేయాలని సూచించారు. ఎల్లమ్మ చెరువును పర్యాటక ప్రదేశంగా ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో అడిషనల్ కలెక్టర్ వెంట చైర్ పర్సన్ దండి లక్ష్మి,మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్,వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ,వార్డు కౌన్సిలర్ మరియు అధికారులు ఉన్నారు.

# గంభీరావుపేట సెక్షన్‌లో
# 3.0 కి.మీ. 33కేవీ ఇంటర్‌లింక్ లైన్ విజయవంతం

వాస్తవం : గంభీరావుపేట



రాజన్న సిరిసిల్ల సర్కిల్, గంభీరావుపేట సెక్షన్ పరిధిలోని కొత్తపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించే మహత్తర లక్ష్యంతో 3.0 కిలోమీటర్ల పొడవైన 33కేవీ ఇంటర్‌లింక్ లైన్‌ను విజయవంతంగా శుక్రవారం రోజున చార్జ్ చేశామని ఎన్పీడీసియల్ చీఫ్ ఇంజినీర్ (ఆపరేషన్స్-1), బి.అశోక్ తెలిపారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన ఈ ఇంటర్లింకింగ్ లైన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్స్), సిరిసిల్ల టి.వేణు మాధవ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, అత్యంత విజయవంతంగా నిర్వహించబడిందనీ అన్నారు. ఈ ఇంటర్‌లింక్ లైన్ ప్రారంభంతో కొత్తపల్లి, శ్రీగాధ, కోళ్ళమద్ది, రాజుపేట గ్రామాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఇప్పుడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని అశోక్ స్పష్టం చేశారు. ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడినప్పుడు లేదా భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఉరుములు మెరుపులు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రధాన విద్యుత్ లైన్లలో అంతరాయాలు సంభవించినప్పుడు, ఈ ఇంటర్‌లింక్ లైన్ ద్వారా ప్రత్యామ్నాయ మార్గంలో నిరవధికంగా విద్యుత్ సరఫరా కొనసాగించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. దీని వలన గ్రామీణ ప్రాంత వినియోగదారులకు కరెంటు అంతరాయాలు గణనీయంగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో నిరంతరత సాధించడం వలన ఈ గ్రామాల రైతులకు వ్యవసాయ విద్యుత్ సకాలంలో అందుతుందని, గృహ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సేవలు లభిస్తాయని, స్థానిక చిన్న పరిశ్రమలకు వ్యాపారాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందని అశోక్ వివరించారు. ఈ ఇంటర్‌లింక్ లైన్ ఏర్పాటు వలన విద్యుత్ వ్యవస్థలో రెండు మార్గాల సరఫరా అందుబాటులోకి వచ్చిందని, ఇది ఆధునిక విద్యుత్ పంపిణీ వ్యవస్థకు ఒక మైలురాయి అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో, అత్యంత నేర్పుతో విజయవంతంగా పూర్తిచేసిన గంభీరావుపేట సెక్షన్ సిబ్బందిని, సంబంధిత ఇంజినీర్లను సీఈ బి.అశోక్, ఎస్ఈ టి. వేణు మాధవ్ అభినందించారు. గ్రామీణ ప్రాంత వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ విభాగపు అత్యున్నత లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం శ్రమిస్తామని వారు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సర్కిల్ పరిధిలోని ఇతర సబ్‌స్టేషన్లకు కూడా ఇలాంటి ఇంటర్‌లింక్ లైన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్స్) టి. వేణు మాధవ్, డివిజనల్ ఇంజినీర్ ఎన్. అంజయ్య, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్లు ఆనంద్ , శ్రీమతి పద్మ, గంభీరావుపేట సెక్షన్ సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన ప్రదర్శన

వాస్తవం : సిరిసిల్ల




రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు జిల్లా ఉద్యోగుల జాయింట్ అక్షన్ కమిటీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్, కో చైర్మెన్ సమర సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులకు రావలసిన పెండింగ్ బిల్లులు పిఆర్ సి ఈహెచ్ఎస్ ఉద్యోగుల సమస్యల పై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా పరిశీలకులుగా విచ్చేసిన రాష్ట్ర లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.... ఉద్యోగులకు ఇవ్వవలసిన రెండో పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న అన్ని డిఏ లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన అన్ని రకాల అన్ని రకాల బెనిఫిట్స్ ను ప్రభుత్వం త్వరగా మంజూరు ఇవ్వాలని, లేని ఎడల ప్రభుత్వం ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్యన దూరం పెరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉద్యోగుల హెల్త్ కార్డులను వెంటనే పూర్తి చేయాలని, సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంలో ఇట్టి విషయాన్ని మేనిఫెస్టోలో పొందుపరిచిన సంగతిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల సుదర్శన్ జిల్లా టీ జి ఓ కార్యదర్శి సయ్యద్ జబి, శ్రీకాంత్, రియాజ్, సాగర్ అన్ని సంఘాల యూనియన్ బాధ్యులు, ఉపాధ్యాయులు పెన్షనర్స్ పాల్గొన్నారు. కార్యక్రమనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ జి నగేష్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు.

## ఉద్యోగ , ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



వాస్తవం : మోత్కూర్

తెలంగాణ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఉద్యోగ ఉపాధ్యాయ మరియు పెన్షన్ దారులతో కూడిన టీజీ జెఎసి ఈరోజు అన్ని తాసిల్దార్ కార్యాలయాల ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

1.తెలంగాణ రెండవ పిఆర్సీని వెంటనే అమలు చేయాలని2. డిజిటల్ హెల్త్ కార్డులు ఇచ్చి నగదు రహిత వైద్య సదుపాయాలు వెంటనే కల్పించాలని 3.పెండింగ్లో ఉన్న అన్ని రకాల అందరి బకాయిలను ఏక మొత్తంగా వెంటనే చెల్లించాలని మరియు4.పాత పెన్షన్ విధానం అందరికీ వర్తింపజేయాలని కోరుతూ వినతి పత్రాన్ని తాసిల్దారికి సమర్పించడమైనది. ఈ కార్యక్రమంలో అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ మరియు పెన్షనర్ల సంఘ బాధ్యులు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు పెన్షనర్ల సంఘం నుండి యూనిట్ అధ్యక్షులు బి ఆదిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు కార్యదర్శి వల్లభాయి వారాల యాదగిరి పి ఆర్ టి యు రాష్ట్ర బాధ్యులు డి వెంకటయ్య పి సుధాకర్ యుటిఎఫ్ జిల్లా బాధ్యులు ఏ వెంకటాచారి, డి వెంకన్న పాల్గొన్నారు.

## నిరాశ్రయ మృతుడి కుటుంబానికి ఆశ్రయించిన సిరిసిల్ల పౌర సంక్షేమ సంఘం

వాస్తవం : సిరిసిల్ల



స్వంత ఇల్లు లేక సిరిసిల్ల పట్టణంలో కిరాయి ఇంట్లో జీవిస్తున్న బి సతీష్ అనే వ్యక్తి చనిపోగా ఆ మృతదేహాన్ని కిరాయికి ఉన్న ఇంటి యజమాని నిరాకరించారు. సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షులు బియ్యంకార్ శ్రీనివాస్ తన స్వంత ఇంటి ముందు ఆ మృతదేహాని కి ఆశ్రయాన్ని ఇచ్చి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇలాంటి వ్యక్తులు ఎంత మంది ముందుకు వస్తారు. అందుకు మున్సిపల్ ద్వారా ప్రభుత్వం ద్వారా నిర్మించిన భవనా లు, కమిటీ హాల్స్ , రైతు వేదికలు ఉన్నాయని, వీటిని స్వంత ఇల్లు లేని చనిపోయిన కుటుంబాలకు ఆశ్రయాలు కల్పించాలని బియ్యంకార్ శ్రీనివాస్ కోరుతున్నారు. సిరిసిల్ల పట్టణంలో కొన్ని కమిటీ హాల్ లో మౌలిక వసతులు లేకపోవడం వలన నిరాశ్రయ కుటుంబాలు బాధపడుతున్నారని, 101 రూపాయలతో ఆర్థికంగా నిరుపేదలకు అంత్యక్రియలు నిర్వహించడం సంతోషమే కానీ, ఆశ్రయం లేక శవాన్ని ఇంటి ముందు వేయనీయక కపోవడం, పెదకర్మ అయేంతవరకు యజమాని ఇంటిలోకి రానీయకపోవడం వలన నిరాశ్రయులు చాలా ఇబ్బందిగా మానసికంగా ఇబ్బందులకు గురై కృంగిపోవుచున్నారని, అలాంటి వారికి అన్ని సదుపాయాలు కల్పించి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని శ్రీనివాస్ కోరుతున్నారు. నిరాశయుల ధీన పరిస్థితిని చూసి జిల్లా అధికార యంత్రాంగం, మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్పందించి ఆదుకొని కల్పించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి ఉపాధ్యక్షులు చికోటి అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి కుసుమ గణేష్, కోశాధికారి చిప్ప దేవదాస్, సభ్యులు మడికొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ సంక్షేమ సంఘం
Regd 914/2015
జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# తెలంగాణపై బీజేపీ విషం చిమ్ముతోంది

**బీజేపీ తెలంగాణ ఎంపీల మౌనం సిగ్గుచేటు**

**వాస్తవం : చిగురుమామిడి**

పార్లమెంటు సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలం గాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని కాంగ్రెస్ మండల నాయకుడు బోయిని వంశీ కృష్ణ అన్నారు. శుక్రవారం చిగురుమామిడి మండలంలో నిర్వహించిన ఓ సమావేశంలో పాల్గొన్న వంశీ కృష్ణ మాట్లాడుతూ బీజేపీ నేతలకు తెలంగాణ రాష్ట్రం పట్ల చిత్తశుద్ధి లేదని మరోసారి నిరూపితమైందన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని, అమర వీరుల త్యాగాలనుఅవమానించడం అలవాటుగా మార్చుకున్నారని వంశీకృష్ణ మండిపడ్డారు. తెలంగాణపై గతంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు, ఈ మధ్య కాలంలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ యుద్ధ నౌక గద్దర్ పై చేసిన వ్యాఖ్యలు, ఇప్పుడు ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇలా ఒక్కొక్కరుగా తెలంగాణ రాష్ట్రం పట్ల విషం చిమ్ముతూన్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఎవరి దయా దాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో కాలేదన్నారు. దశాబ్దాల కాలం పాటు సాగిన తెలంగాణ ప్రజల సుదీర్ఘ పోరాటం, వందలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందని బీజేపీ నేతలు తెలంగాణ చరిత్ర తెలుసుకోవాలన్నారు. చరిత్ర మూలాలను అవమానిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆకలినైనా ఓర్చుకుంటారు కానీ అవమానాన్ని మాత్రం భరించలేరన్నారు. ఇక బీజేపీ తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండడం సిగ్గుచేటని రాష్ట్ర ప్రజలు సంఘటితమై ఎక్కడికక్కడ వారిని నిలదీయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఎంపీ తేజస్వి



సూర్యతోపాటు బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా నేతల నాయకత్వంలో పని చేసిన పార్టీ కాంగ్రెస్ రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకువచ్చారని, సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారని గుర్తు చేశారు. బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని ఇంత కాలం ప్రధాని మోడీ ఈ బిల్లును పట్టించుకోలేదని బీజేపీ నేతలు ఇప్పటికైనా మేల్కొని తెలుసుకుంటే మంచిదన్నారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి

**వాస్తవం : సిరిసిల్ల**

ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయుల అపరిష్కృత న్యాయమైన డిమాండ్ల సాధనకై టీజీఈ జేఏసీ ప్రకటించిన కార్యాచరణలో భాగంగా శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రధానోపాధ్యాయులు కైరి పద్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తన్నీరు పద్మజ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలను దరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాద్రీ మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి సరికాదని తక్షణమే డీఏ బకాయిలు పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీటీయు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కొండి కొప్పుల



రవి మాట్లాడుతూ.. ప్రభుత్వ జాప్యం కారణంగా రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగులతో పాటు సర్వీసులో ఉన్న ఉద్యోగులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హెల్త్ కార్డులు, పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మానవతా దృక్పథంతో తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వడ్యారపు మధుసుధన్, పి అనిల్ వేముల అంజలి, ముంజ రమ, వెంగల పల్లవి, పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలకు పెద్దపీట

**పాతబస్తీలో పర్యాటక రంగాన్ని మరింత మెరుగు పరుస్తాం : మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

**వాస్తవం : రాజేంద్రనగర్**

ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ మాటలతో కాకుండా ఆచరణలో అభివృద్ధిని చేసి చూపిస్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మైలార్దేవ్ పల్లి నుండి శాస్త్రి పురం మీదుగా వట్టేపల్లి వరకు నిర్మించిన ఆర్ఓబి (రైల్వే ఓవర్ బ్రిడ్జి) ప్రారంభోత్సవానికి మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. శుక్రవారం ఉదయం నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, రహమత్ బేగ్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ లతో కలిసి మంత్రి రిబ్బన్ కట్ చేసి వాహనాల రాకపోకలను ప్రారంభించారు. 490 మీటర్ల పొడవు, నాలుగు లైన్లతో, 71 కోట్ల రూపాయలతో నిర్మితమైన ఈ బ్రిడ్జి ప్రజలకు అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ప్రారంభోత్సవ అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరా



బాదులో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం ఈ బ్రిడ్జి పనులను పూర్తి చేయలేకపోయిందని గుర్తు చేశారు. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ ముందుకు వెళ్తామని అన్నారు. టూరిస్టులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేసి పర్యాటకపరంగా పాతబస్తీ రూపురేఖలను మారుస్తామని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించిన ప్రభుత్వానికి, మంత్రికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.

## ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలి



**వాస్తవం : మోత్కూర్**

ఉద్యోగస్తుల న్యాయపరమైన సమస్యల సాధనకై, ఉద్యోగస్తుల జాయింట్ ఆక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మోత్కూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు, మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జలతో నిరసన తెలియ జేయనైనది. ప్రభుత్వం పై ఒత్తిడి పెంచడంలో భాగంగా తొలి అడుగు వేయనైనది. ఉద్యో గస్తుల సహనశీ, ఓర్పు కోల్పోతే ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఉద్యోగస్తులు ప్రభుత్వంలో భాగమే అనే చెప్పే ప్రభుత్వాలు, ఉద్యోగస్తుల న్యాయపరమైన సమస్య లను పరిష్కరించడంలో మాత్రం మీన మేషాలు లెక్కి స్తున్నాయి. సంక్షేమ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లడం లో ఉద్యోగస్తుల పాత్ర ( ముఖ్యంగా పంచాయతీరాజ్ ఉద్యోగస్తుల), కృషి వర్ణించరానిది . 99 రోజుల ప్రజా పాలన- ప్రణాళికలు వంటి కార్యక్రమాలలో పంచాయ తీ రాజ్ శాఖ ముందుండి నాయకత్వం వహిస్తుంది. ఉద్యోగస్తులకు రావాల్సిన లపై ప్రభుత్వం వెంటనే సా నుకూలంగా స్పందించాలి, ఆర్ధిక ఇబ్బందుల సాకుతో, దాటవేత ధోరణి అవలంబించడం అంటే, ఉద్యోగస్తుల సమస్యల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది స్పష్టం. రానున్న రోజుల్లో ఉద్యోగస్తులు మరో సకలజనుల సమ్మె, మిలియన్ మార్చ్ లాంటి కార్యక్రమాలు చేపట్టడానికి వెనకాడబోమని ప్రభుత్వానికి, ఈనాటి కార్యక్రమం ద్వారా తెలియజేస్తున్నాము.

**టీజీ జెసి ఆధ్వర్యంలో**

## ముప్కాల్ తాసిల్దార్‌కు మెమోరండం




**వాస్తవం : ముప్కాల్**

నిజామాబాదు శుక్రవారం రోజు టీజీఈ జెఏసి ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల పెండింగ్ సమస్యలపై రాష్ట్ర నాయకత్వ ఆదేశానుసారం ముప్కాల్ మండల కేంద్రంలోని తహసిల్దార్ ముంతాజ్బుద్ధిన్ కు మెమోరండం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పిఆర్టియు టిఎస్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 51% ఫిట్మెంట్తో పి ఆర్ సి ని ప్రకటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు మే ఒకటో తారీకు నుంచి ఆరోగ్యకార్డులను అమలు చేయాలని, 2004 సెప్టెంబరు ఒకటో తారీకు కంటే ముందుగా నియమితులైన ఉద్యోగ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం పాత పెన్షన్ స్కీము వర్తింపజేయాలని, సిపిఎస్ని రద్దు చేయాలని, రెండు విడుతలలో మొత్తం పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. కార్యక్రమంలో పి ఆర్ టి యు టీఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు నవీన్ టీఎన్జీవో జేఏసీ ఇంచార్జ్ శ్రవణ్ కుమార్, ఐకెపి ఏపీఎం శ్యామ్, పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర నాయకులు గుండోజి నరేందర్, తాడూరి లక్ష్మణ్, ఎస్ జి శ్రీనివాస్, రామకృష్ణ, రాజేశ్వర్, ధనుంజయ, ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది పృథ్వి నాగేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

# సిపిఎస్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### తహసిల్దార్‌కు వినతి

వాస్తవం: చందుర్తి



సిపిఎస్ ఉద్యోగుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని చందుర్తి మండల సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎడ్ల కిషన్, రమాదేవి లు కోరారు.తమ డిమాండ్ లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ..భోజన విరామ సమయంలో శుక్రవారం చందుర్తి తహసిల్దార్ లాగిశెట్టి భూపతికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కిషన్, రమాదేవి లు మాట్లాడుతూ... జూన్ 2023 కమిషన్ డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేయాలని, పెండింగ్ మెడికల్ బిల్లులు ఇవ్వాలని కోరారు, సిపిఎస్ విధానాన్ని అంతం చేసి ఓపిఎస్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, పిఆర్ సిని జూన్ రెండు నుండి అమలు చేయాలని కోరారు.ఉద్యోగుల 14 వేల కోట్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు బెనిఫిట్స్ లో వెంటనే ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు,జి పిఓలు, ఉపాధ్యాయులు గుడిమల్ల సురేష్,పుప్పాల శ్రీనివాస చారి,మోరె కుమార్,రామస్వామి,ఉరడి మధుసూదన్ రెడ్డి,కాపిల్ల నరేష్,తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

వాస్తవం : చిగురుమామిడి



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె లో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం గ్రామానికి చెందిన కాటం కిషన్ రెడ్డి ఉదయం 10 గంటల సమయంలో తన వ్యవసాయ పొలం నుండి వడ్లను ట్రాకర్‌తో ఇంటికి తరలిస్తుండగా కాటం కుంట కట్ట ఎక్కే క్రమంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం అదుపుతప్పి బోల్తా పడగా డ్రైవర్ కిషన్ రెడ్డి మీద ట్రాక్టర్ ఇంజన్ పడడంతో తల నడుముకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటన గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.మృతుడి తండ్రి కాటం లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

# న్యూ మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణానికి నిధులు మంజూరు

### స్థల పరిశీలన చేసిన తొట్ల తిరుపతి యాదవ్

వాస్తవం : రామగిరి



మంథని నియోజకవర్గం,రామగిరి మండల పరిధిలోని పన్నూర్,నాగేపల్లి క్రాస్ ప్రాంతాల్లో న్యూ మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల నిధులను మంజూరు చేసింది.రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ప్రత్యేక చొరవతో ఈ నిధులు సాధ్యమయ్యాయి.పన్నూర్ బస్ షెల్టర్ నిర్మాణానికి రూ.10 లక్షలు, నాగేపల్లి క్రాస్ బస్ షెల్టర్ నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు కేటాయించబడ్డాయి.మంత్రి ఆదేశాల మేరకు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముందుగా పన్నూర్ గ్రామంలో పర్యటించి,అనంతరం నాగేపల్లి క్రాస్ ప్రాంతాన్ని సందర్శించి,బస్ షెల్టర్ల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మంజూరైన నిధులతో అత్యాధునిక సౌకర్యాలతో బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టి,ప్రయాణికులకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించారని,గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్,నాగేపల్లి గ్రామ సర్పంచ్ కొండావేన దివ్య సుధాకర్, తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు కు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ ప్రజలు కూడా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎల్లే రామ్మూర్తి,ఆదివారం పేట సర్పంచ్ ఇల్లందుల సంజీవ్,మాజీ సర్పంచ్లు ఎరుకల ఓదెలు,తీగల సమ్మయ్య, రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం సెంటెనరి కాలనీ టౌన్ అధ్యక్షులు కాటం సత్యం,గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒర్రె సది,గొల్లపల్లి రాజమల్లు,ఐఎన్టియుసి నాయకులు పెద్ది సమ్మయ్య,అర్జున్ రావు,పన్నూర్ గ్రామ యూత్ అధ్యక్షులు ఏరావేనే అజయ్,యూత్ ఉపాధ్యక్షులు సిద్ధం బన్నీ,నాగేపల్లి యూత్ అధ్యక్షులు వేగోలపు సంతోష్ పాల్గొన్నారు.






# తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత



వాస్తవం : మనోహరాబాద్

పిఆర్సి అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కాలయాపనకూ నిరసిస్తూ శుక్రవారం మనోహరాబాద్ తహసిల్దార్ ఆంజనేయులు,ఎంపీడీవో కృష్ణమూర్తి లకు పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు.రాష్ట్ర జేసీ పిలుపు మేరకు పిఆర్సిని 51 శాతం ఫిట్మెంట్ తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఎంప్లాయిమెంట్ అసోసియేషన్ పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర కమిటీ మహిళా విభాగపు ఉపాధ్యక్షురాలు టి. రూప గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్యదర్శుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు,లేని పక్షాన నిరసన కార్యక్రమాల తీవ్రత మరింత పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన**

# మాజీ జెడ్పీ చైర్మన్



వాస్తవం : చందుర్తి

చందుర్తి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ కీర్తిశేషులు చింతపల్లి రాజేశ్వరరావు సతీమణి అంజలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ శుక్రవారం కుటుంబీకులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో చందుర్తి మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మండల పరిషత్ కో-ఆప్షన్స్ సభ్యులు బత్తుల కమలాకర్, నలుమాసు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల విత్తనాల పంపిణీ



వాస్తవం : చందర్తి

చందుర్తి మండలందేవుని తండ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షులు భూక్యా గబ్బర్ సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి లోకేష్, అగ్రికల్చర్ ఆయిల్ ఫామ్ అధికారి నాగరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గబ్బర్ సింగ్ మాట్లాడుతూ.... రైతులకు ఇలాంటి అవకాశాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలను రైతులందరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఛలో హైదరాబాద్ 20న జరిగే

# దరువు జాతర సభ గోడ పత్రిక విడుదల



వాస్తవం : తిరుమలగిరి

తిరుమలగిరి చౌరస్తా లో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు గిలకత్తుల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 20 న హైదరాబాద్ రవీంద్ర భారతి లో జరుగబోయే దరువు జాతర వాల్ పోస్టర్ ను విడుదల చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లన్న, సిపిఎం పార్టీ జిల్లా నాయకులు కడెం లింగయ్య, కందుకూరి ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుండి మొదలు కొని ఈనాటి వరకు ఎన్నో ప్రజా ఉద్యమాలు చేసిన ఘనత దరువు ఎల్లన్న, దరువు అంజన్న ఆధ్వర్యంలో దరువు వేదిక ను స్థాపించి నేటికీ 25 సంవత్సరాల సందర్భంగా వీరులారా వందనం విద్యార్థి అమరులారా వందనం అనే వీడియో పాటను కూడ విడుదల చెయ్యడం జరుగుతుంది కావున రవీంద్ర భారతిలో ఈ నెల 20 న సంబరాల సభ ను నిర్వహించచడం జరుగుతుంది కావున ఉద్యమ కారులు, ఉద్యమ కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చెయ్యాలని దరువు అంజన్న కు దరువు ఎల్లన్నకు అందరు మద్దత్తు నివ్వాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతుల నరేష్ గౌడ్, కందుకూరి గిరి కుమార్ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన టీజీఈ జేఏసీ సభ్యులు



వాస్తవం : తిరుమలగిరి

టీజీఈ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు తిరుమలగిరి మండల జేసీసీ ఆధ్వర్యంలో ప్రధానంగా నాలుగు డిమాండ్ల సాధనకై తిరుమలగిరి మండలం తహసిల్దార్ భాశెట్టి హరిప్రసాద్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో తిరుమలగిరి మండల జేసీసీ నాయకులు, టీజీసీపీఎస్ఈయు రాష్ట్ర నాయకులు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా:సంజీవ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపాటి నరేష్, జిల్లా నాయకులు పోలిశెట్టి ఉపేందర్, పెన్నన్నర్లు, కార్మికులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది.

# యువతకు ప్రేరణగా నిలవాలి



మంత్రి పొన్నం

వాస్తవం : హుస్నాబాద్

హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన కల్లేపల్లి ప్రశాంత్ ఇటీవల డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్,డా. ప్రశాంత్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తూ, గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఉన్నత విద్యలో డాక్టరేట్ సాధించడం గర్వకారణమని తెలిపారు. సమాజ అభివృద్ధికి, ముఖ్యంగా యువతకు ప్రేరణగా నిలిచే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఆయన సాధించిన విజయం హుస్నాబాద్ నియోజకవర్గానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని మంత్రి పేర్కొన్నారు. డా. కల్లెపల్లి ప్రశాంత్ హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామానికి చెందినవారు. ఆయన కాకతీయ యూనివర్సిటీ లో ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ పట్టా పొందారు. విద్యాభ్యాస కాలంలోనే విద్యార్థి నాయకుడిగా చురుకుగా పనిచేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయ స్థాయిలో పలు ఉద్యమాలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు. తన విద్యా ప్రయాణంలో గురువుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, స్నేహితుల సహకారం ఎంతో దోహదపడినట్లు డా. ప్రశాంత్ పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు కొనసాగించి, విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలవాలని తన లక్ష్యంగా తెలిపారు.


జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


## లీడ్ బ్యాంకు మేనేజర్‌తో సమావేశం



వాస్తవం : రామగిరి

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్,తహసీల్దార్ పర్నింది సుమన్ లు మేడిపల్లి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బ్యాంకర్ లను రైతుల వద్దకు పంపించారు. ఇండస్ట్రియల్ పార్క్ కింద రామగిరి ఖిల్లాలోని మేడిపల్లి శివారులో ప్రభుత్వం 200 ఎకరాల వ్యవసాయ భూమిని తీసుకుంది. ఈ క్రమంలో రైతులు కలెక్టర్ వద్ద పలు ప్రతిపాదనలు చేశారు. రైతులకు షూరిటీ లేకుండా రూ.10 లక్షల రుణం ఇవ్వాలని,క్రాప్ లోన్ మాఫీ చేయాలని బ్యాంక్ అధికారులకు తేల్చి చెప్పారు. రైతులు మంగళవారం లోపు తమ ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు,రత్నాపూర్‌యూనియన్ బ్యాంక్ మేనేజర్ కొత్తరా మురళి,పెద్దపల్లి మేనేజర్ శ్రీధర్,రామగిరి ఆర్.ఐ కె.మహేష్,పంచాయతీ సెక్రెటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసీ మహిళలపేరిట

## ఇసుక సొసైటీనీ ఏర్పాటు చెయ్యాలి

ఇరప.రాజు దొర,ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్

చర్ల : వాస్తవం



చర్ల మండలంలోని కలివేరు గ్రామ పంచాయతీలో గల ఆదివాసీ మహిళల పేరిట ఇసుక సొసైటీ ఏర్పా టు చెయ్యాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరప.రాజు దొర డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు..కలివేరు గ్రామంలో ఆదివాసీ మహిళల పేరిట ఇసుక సొసైటీ ఏర్పాటు చేసి ఆదివాసీ మహిళలు,జీవనోపాధి పొందే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్థికంగా అండదండలు అం దించాలని ఇందుకోసం గిరిజన సంక్షేమ శాఖ భద్రా చలం ఐటిడిఏ ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేయ్యాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుండి సరైన ఆర్థిక సహకారం ఇవ్వకపోతే ఆదివాసీ మహిళలు ప్రైవేట్ కాంట్రాక్టర్లను,బినామీలను బ్రోకర్‌లను, గిరిజనేతరలను నమ్మి మోసపోవాల్సి వస్తోందన్నారు. ఈ విషయమై భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## హైమస్ లైట్‌లు బిగింపు

వాస్తవం:రామగిరి



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో శుక్రవారం హైమాస్ లైట్లను బిగించారు. ఈ మేరకు సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు లైట్ల బిగింపును పరిశీలించారు. గత రెండు సంవత్సరాలుగా హైమస్ లైట్లు వెలగడంలేదు. దీంతో మొదటి విడత 15 లైట్లను మరమ్మత్తులు చేయించారు. వీటిని పలు కూడలిలలో బిగించారు. రాత్రివేళ ఇబ్బందులు ఉండవద్దనే ఈ లైట్లను బిగించామని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గంగుల సంతోష్ పాల్గొన్నారు.